సాక్షి
బాపట్ల
శనివారం । 7 । జనవరి । 2023



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 578.40 అడుగుల వద్ద ఉంది. ఇది 278.3956 టీఎంసీలకు సమానం.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 43.9865 టీఎంసీలు. ఎగువ నుంచి 2,000 క్యూసెక్కులు వస్తుండగా దిగువకు 2200 క్యూసెక్కులు వదులుతున్నారు.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఒక్క కరోనా పాజిటివ్ కేసు కూడా నమోదు కాలేదు. ఎక్కడా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

ఆరుద్రాయ'నమః



అమరావతి: అమరావతిలోని శ్రీబాల చాముండికా సమేత అమరేశ్వరునికి శుక్రవారం వేకువ జామున మహన్యాస పూర్వక ఏకాదశ రుద్ర అన్నాభిషేకాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత పంచామృతాలతో, ఆ తర్వాత దాతల సహకారంతో సుమారు నాలుగు క్వింటాళ్ళ బియ్యాన్ని అన్నంగా వండి స్వామిని అభిషేకించారు. ఈసందర్భంగా ఈఓ సునీల్‌కుమార్ మాట్లాడుతూ ధనుర్మాసంలో అమరేశ్వరునికి అత్యంత ప్రీతిపాత్రమైన రోజు ఇదని, స్వామి జన్మనక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం రోజున ఈ అన్నాభిషేకాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. బాలచాముండేశ్వరి అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించిన అనంతరం అభిషేకించిన అన్నాన్ని ప్రసాదంగా భక్తులకు పంపిణీ చేశారు.

త్రికోటేశ్వరుని సన్నిధిలో ఆరుద్రోత్సవం



నరసరావుపేట రూరల్: కోటప్పకొండ శ్రీత్రికోటేశ్వర స్వామి దేవస్థానంలో ఆరుద్రోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామికి విశేష ద్రవ్యాలతో అభిషేకాలను కన్నులపండువగా జరిపారు. గురువారం అర్ధరాత్రి నుంచి ప్రారంభమైన అభిషేకాలు శుక్రవారం తెల్లవారుజాము వరకు కొనసాగాయి. భక్తులు అధిక సంఖ్యలో అభిషేకాల్లో పాల్గొన్నారు. శుక్రవారం పౌర్ణమి కూడా కావడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి దివ్యమంగళ స్వరూపాన్ని దర్శించి తరించారు. ఆలయ ఈఓ. వేమూరి గోపి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రభుత్వానికి పంట నష్ట నివేదిక

కొరిటిపాడు(గుంటూరు): ఇటీవల సంభవించిన మాండూస్ తుఫాన్ వల్ల గుంటూరు జిల్లాలోని వివిధ మండలాల్లో 6,582.93 హెక్టార్లలో 33 శాతం కంటే ఎక్కువగా పంట దెబ్బతిన్నట్లు వ్యవసాయ, ఉద్యాన శాఖలు నిర్ధారించాయి. వారం క్రితమే పంట నష్ట నమోదు పూర్తయింది. అనంతరం సామాజిక తనిఖీ కోసం రైతు భరోసా కేంద్రాల్లో జాబితాలను ఉంచారు. సామాజిక తనిఖీ అనంతరం పంట నష్టం వివరాలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు, జిల్లా ఉద్యానశాఖ అధికారి ఎన్.సుజాత రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు. పొన్నూరు, చేబ్రోలు, దుగ్గిరాల, తెనాలి, కొల్లిపర, పెదకాకాని, తాడేపల్లి, కాకుమాను మండలాల్లో వరి పంటకు, కాకుమాను, వట్టిచెరుకూరు, పెదనందిపాడు, ప్రత్తిపాడు మండలాల్లో మిరపకు, తెనాలి, పెదకాకాని మండలాల్లో మినుము పంటకు మాండూస్ తుఫాన్ వల్ల నష్టం వాటిల్లింది. వరి 4,576.22 హెక్టార్లలో, మిరప 1,864.42 హెక్టార్లలో, మినుము 142.29 హెక్టార్లలో దెబ్బతిన్నట్లు అధికారులు నిర్ధారించారు. 9,848 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ద్వారా రూ.9.81 కోట్ల పరిహారం విడుదల చేయాలని ప్రభుత్వానికి నివేదించారు.

నవోదయలో ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

చిలకలూరిపేట: జవహర్ నవోదయ విద్యాలయ ఆరోవ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహరావు తెలిపారు. విద్యార్థులు ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెంది 2022-23 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాల లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఐదో తరగతి చదువుతూ ఉండాలని, విద్యార్థి తల్లిదండ్రులు గుంటూరు జిల్లా నివాసి అయ్యి ఉండాలని పేర్కొన్నారు. విద్యార్థి 01-06-2011 నుంచి 30-04-2013 తేదీ మధ్య జన్మించి ఉండాలని వివరించారు. అభ్యర్థులు ఈ నెల 30వ తేదీలోగా అధికారిక వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయాలని కోరారు.

39,193 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 38,437 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 39,193 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.27,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.26,800 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాలుకు రూ.13,500 నుంచి రూ.26,500 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాలకు రూ.11,500 నుంచి రూ.26,200 వరకు ధర పలికింది.

వందే ఓటరమ్మా..

నిర్ణేతలు మహిళలే

- పురుషుల కంటే 24,457 మంది అధికం
- ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ అతివలదే పైచేయి
- ఇప్పటికే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట
- స్థానిక సంస్థలు.. కార్పొరేషన్లలో 50 శాతానికిపైగా పదవులు
- సంక్షేమ పథకాల్లోనూ అగ్రతాంబూలం



సాక్షి ప్రతినిధి, బాపట్ల: జిల్లాలో మహిళా ఓటర్లు పెరిగారు. ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ అతివలే అధికంగా ఉండడం విశేషం. దీంతో రాబోయే ఎన్నికల్లో వీరే నిర్ణేతలు కానున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పటికే మహిళలకు పెద్దపీట వేస్తోంది. స్థానిక ఎన్నికలు మొదలుకొని అన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లోనూ వనితలకు ప్రథమ ప్రాధాన్యం దక్కుతోంది. ఈ నేపథ్యంలో మహిళా ఓటర్ల పెరుగుదల అధికార పార్టీకి సానుకూల అంశమని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

అత్యధికంగా పర్చూరులో..

ఎన్నికల కమిషన్ ప్రకటించిన ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 12,52,432 మంది ఓటర్లు ఉండగా ఇందులో 6,13,948 మంది పురుషులు, 6,38,405 మంది మహిళలు, 79 మంది ఇతరులు ఉన్నారు. పురుషులతో పోలిస్తే జిల్లాలో 24,457 మంది మహిళలు అధికంగా ఉండటం విశేషం. పర్చూరు నియోజకవర్గంలో అత్యధికంగా 5,541 మంది మహిళా ఓటర్ల పెరుగుదల కనిపిస్తుండగా, రేపల్లెలో 2,381 మందితో స్వల్ప పెరుగుదల కనిపిస్తోంది.

ఏడాదికి నాలుగుసార్లు ఓటర్ల సవరణ :

గతంలో ఏడాదికి ఒకమారు మాత్రమే కొత్త ఓటర్ల ప్రక్రియను ఎన్నికల కమిషన్ నిర్వహించేంది. ఇటీవల ఏడాదికి నాలుగుసార్లు కొత్త ఓటర్ల నమోదుకు ఎన్నికల కమిషన్ శ్రీకారం చుట్టింది. జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబర్ నెలల్లో ఈ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. గతంలో 18 సంవత్సరాలు నిండిన వారు ఏడాదికి ఒకమారు ఓటు హక్కు నమోదుచేసుకునే వారు. తాజాగా 18వ సంవత్సరం జరుగుతున్న వాళ్ళు కూడా ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. అయితే 18 సంవత్సరాలు పూర్తి అయిన తర్వాత మాత్రమే వారికి ఓటు హక్కు లభిస్తుంది. జిల్లాలో పునర్విభజన అనంతరం తొలిసారి ఓటర్ల నమోదు ప్రక్రియను ఎన్నికల కమిషన్ నిర్వహించింది.

అక్కచెల్లెళ్లకు సీఎం ప్రాధాన్యం

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి మహిళలకు పెద్దపీట వేశారు. అమ్మఒడి మొదలు వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్సార్ చేయూతలాంటి పలు సంక్షేమ పథకాలను మహిళల పేరుతో అందజేశారు. ఇంటి స్థలాలతోపాటు పక్కా గృహాలనూ ఆడపడుచుల పేరుతోనే రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించి మహిళలను ప్రజాప్రతినిధులను చేశారు. పెద్ద ఎత్తున నెలకొల్పిన కార్పొరేషన్లలోనూ మహిళలకు 50 శాతంపైగా పదవులు కట్టబెట్టారు. దీంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై, ఆయన పాలనపై అతివల్లో ఆదరణ పెరిగింది. ఈ క్రమంలో వారు మరింత చైతన్యవంతంగా మారి రాబోయే ఎన్నికల్లో కీలకభూమిక పోషించనున్నారు. మహిళల చైతన్యం అధికార పార్టీకి మరింత అనుకూలిస్తుందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

జిల్లాలో పెరిగిన మహిళా ఓటర్లు

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	పెరిగిన సంఖ్య
బాపట్ల	89,512	93,024	3,512
వేమూరు	93,068	98,122	5,054
చీరాల	94,409	98,504	4,095
రేపల్లె	1,11,842	1,14,223	2,381
పర్చూరు	1,10,050	1,15,591	5,541
అద్దంకి	1,15,067	1,18,941	3,874
మొత్తం	6,13,948	6,38,405	24,457

అధునాతన సాగు పద్ధతుల కోసం నిరంతర కృషి

వైస్ చాన్సలర్ డాక్టర్ ఆదాల విష్ణువర్ధన్ రెడ్డి



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న వీసీ, సలహాదారులు, శాస్త్రవేత్తలు

సాక్షి ప్రతినిధి, బాపట్ల : రైతులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానంతోపాటు అధునాతన సాగు పద్ధతులు, అధిక దిగుబడులిచ్చే వంగడాల రూపకల్పనకు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నిరంతరం కృషి చేస్తోందని వైస్ చాన్సలర్ డాక్టర్ ఆదాల విష్ణువర్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. బాపట్ల వ్యవసాయ కళాశాలలో రెండు రోజుల పాటు జరగనున్న 52వ పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశం తొలి రోజు శుక్రవారం ప్రారంభ సభకు ఆయన అధ్యక్షత వహించారు. విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ విశ్వ విద్యాలయం డ్రోన్ టెక్నాలజీలో పేటెంట్ సాధించి వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులకు శిక్షణ ఇస్తోందన్నారు. రైతులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆర్‌బీకేల పరిధిలో క్షేత్రస్థాయిలో అందజేస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు ఐ.తిరుపాల్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల పక్షపాతి అన్నారు. వివిధ పంటలలో సేంద్రియ సాగు విధానాలపై శాస్త్రవేత్తలు రూపొందించిన పుస్తకాలను ఆవిష్కరించారు. ఉత్తమ వ్యవసాయ పరిశోధనా స్థానంగా విజయనగరం, ఉత్తమ ప్రాంతీయ పరిశోధనా స్థానంగా తిరుపతి, ఉత్తమ కృషి విజ్ఞాన కేంద్రంగా దర్శి, ఉత్తమ ఏరువాక కేంద్రంగా విజయనగరం, చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానానికి అగ్రి టూరిజం ప్రోత్సాహక అవార్డు, ఉత్తమ శాస్త్రవేత్తలుగా డాక్టర్ సాంబయ్య, డాక్టర్ నాగార్జున రెడ్డికి ప్రశంసా పత్రాలను అందజేశారు. ప్రభుత్వ మార్కెటింగ్ శాఖ ప్రత్యేక సలహాదారు బత్తుల బ్రహ్మానంద రెడ్డి, పూర్వ ఉప కులపతి డాక్టర్ పి.రాఘవ రెడ్డి, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ ఎల్.ప్రశాంతి, డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ డాక్టర్ పి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వెనకేసుకో..

- పోలీస్‌స్టేషన్లలో అవినీతి దందా
- అధికారులు, సిబ్బందిదీ అదే తీరు
- నోటు ఇస్తేనే.. '41' నోటీసులు జారీ
- కాసులు కురిపిస్తున్న గుట్కా కేసులు
- ఎస్ఈబీ దాడులు చేసినా.. స్టేషన్‌లో మామూళ్లు
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు



పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): గుంటూరు నగరంలోని పోలీసు సిబ్బంది చెలరేగిపోతున్నారు. ఏడేళ్లలోపు జైలు శిక్ష పడే అవకాశం ఉన్న కేసుల్లో 41 నోటీసులు(స్టేషన్ బెయిల్) జారీ చేయాలన్న అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలను తమకు అనుకూలంగా మలుచుకుని చేతివాటం ప్రదర్శిస్తున్నారు. భారీగా వెనకేసుకుంటున్నారు. దీనిపై ఎన్ని ఆరోపణలు వస్తున్నా.. ఉన్నతాధికారులు కనీస చర్యలకు ఉపక్రమించడం లేదు.

ఇవిగో నిదర్శనాలు

- మూడు రోజుల క్రితం పెదకాకాని పీఎస్ పరిధిలో స్టేషన్ బెయిల్ ఇచ్చే పోలీసు ఒకరు నిందితుల వద్ద నుంచి రూ.10 వేలు డిమాండ్ చేశారు.
- కొద్ది రోజుల క్రితం ఈస్ట్ ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వర్తించే కానిస్టేబుల్ ఓ యాక్సిడెంట్ కేసులో 41 నోటీసుల జారీకి రూ.పదివేలు అడిగారు.
- ఇటీవల దిశ పీఎస్ పరిధిలో ఒక ఎస్‌ఐ స్థాయి అధికారి 498ఏ కేసులో స్టేషన్ బెయిల్ కోసం భారీగా డబ్బులు డిమాండ్ చేసిన ఘటన కలకలం రేపింది.
- వెస్ట్ సబ్‌డివిజన్ పరిధిలో పేకాట ఆడుతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.70 వేలు తీసుకుని నోటీసులు జారీ చేశారని సమాచారం.

గుట్కా కేసులతో కాసుల గలగల

గుట్కా విక్రయాలు పోలీసు అధికారులు, సిబ్బందికి కాసులు కురిపిస్తున్నాయి. కొద్ది రోజుల క్రితం వెస్ట్ సబ్‌డివిజన్ పరిధిలో వ్యాపార సముదాయాలు అధికంగా ఉన్న ఒక స్టేషన్ పరిధిలో ఉదయం వేళలో నిఘా వర్గాలు భారీగా గుట్కాలను స్వాధీనం చేసుకున్నాయి. ఈ కేసులో సరైన విచారణ జరపకుండానే ప్రధాన నిందితుడికి స్టేషన్ బెయిల్ మంజూరు చేశారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. 41 నోటీసులు జారీ చేసిన క్రమంలో భారీ ఎత్తున నగదు తీసుకున్నారనే విమర్శలు వినిపించాయి.

- ఆర్టీసీ బస్టాండ్‌కు అతి సమీపంలో ఉండే ఒక పీఎస్ పరిధిలో ఎస్ఈబీ అధికారులు గుట్కా నిల్వలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌లో అప్పగించారు. అయితే ఆ తరువాత ఒక ఎస్‌ఐ స్థాయి అధికారి సదరు వ్యాపారికి ఫోన్‌చేసి స్టేషన్ బెయిల్ కోసం రూ.60వేలు తీసుకున్నారని తెలుస్తోంది. ఎస్ఈబీ అధికారులు స్వాధీనం చేసుకుని స్టేషన్‌లో అప్పగించిన కేసుల విషయంలోనూ సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఫిర్యాదు చేస్తే చర్యలు



41 నోటీసులు జారీ చేసే అంశంలో అధికారులు, సిబ్బంది డబ్బులు డిమాండ్ చేస్తుంటే బాధితులు నేరుగా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయొచ్చు. ఎట్టి పరిస్థితుల్లోనూ అవినీతికి పాల్పడేవారిని ఉపేక్షించం. స్టేషన్లలో నిందితులను ఇబ్బందులకు గురి చేస్తే.. శాఖాపరమైన చర్యలు చేపడతాం.

– కె.సుప్రజ, అడిషనల్ ఎస్పీ, గుంటూరు జిల్లా

సాగు, తాగునీటికి ప్రభుత్వం ప్రాధాన్యం

ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించిన మంత్రి నాగార్జున



ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి నాగార్జున

బల్లికురవ: సాగు, తాగునీటికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున చెప్పారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని వెలమవారిపాలెం గ్రామ సమీపంలోని గుండ్లకమ్మపై రూ.8.75 కోట్లతో నిర్మించిన ఎత్తిపోతల పథకాన్ని మంత్రి స్విచ్ ఆన్‌చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన 1,036 ఎకరాలు వెంపరాల మేజర్ ఆయకట్టులో చివరి భూములు కావడంతో నీరందనందునే ప్రభుత్వం ఈ పథక నిర్మాణాన్ని చేపట్టి సకాలంలో పూర్తి చేయించిందని చెప్పారు. ఇక సాగుకు ఢోకా ఉండదని మంత్రి చెప్పారు. అభివృద్ధిని చూసి ఓర్వలేకనే చంద్రబాబు పిచ్చిపట్టినట్లుగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజాసంకల్ప యాత్రతో ప్రజల సమస్యలు తెలుసుకుని సంక్షేమ, అభివృద్ధి పథకాలతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రగతికి బాటలు వేస్తూ నంబర్ వన్ సీఎంగా గుర్తింపు పొందితే చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు దుష్ప్రచారం చేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. మూడున్నరేళ్లుగా ప్రజలు సీఎం జగన్‌కు నీరాజనాలు పలుకుతున్నారని, మూడు దశాబ్దాలపాటు జగనే ముఖ్యమంత్రిగా కొనసాగుతారని మంత్రి నాగార్జున జోస్యం చెప్పారు. చంద్రబాబు శవ రాజకీయాలు మానుకుని ప్రశాంతంగా విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ప్రారంభ కార్యక్రమంలో రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య, జిల్లా సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతల పేరయ్య, ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి, గ్రామ సర్పంచ్ నూనె ప్రభుదాసు, ఎంపీటీసీ సభ్యులు ఎం.అంజమ్మబాయి, గ్రామ నాయకుడు టి.నరేష్, ఎంపీడీవో సీహెచ్ కృష్ణ, తహసీల్దార్ పి.సీతారత్నం, ఐడీసీ ఈఈ జె.వేణుగోపాల్, విద్యుత్ శాఖ ఈఈ మస్తాన్‌రావు పాల్గొన్నారు.

రైలు ఢీకొని కానిస్టేబుల్ మృతి

బాపట్లటౌన్: రైలు ఢీకొని కానిస్టేబుల్ మృతి చెందిన ఘటన మండలంలోని అప్పికట్ల సమీపంలో జరిగింది. వివరాల్లోకి వెళితే మండలంలోని భర్తిపూడి గ్రామానికి చెందిన పి.సుబ్బారావు (53) పల్నాడు జిల్లా గురజాల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. నెల రోజుల నుంచి మద్యం మత్తులో జోగుతూ విధులకు సక్రమంగా హాజరు కావట్లేదు. ఇంటివద్దనే ఉంటున్నారు. శుక్రవారం అప్పికట్ల సమీపంలో రైల్వే ట్రాక్ దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీకొని మృతి చెందారు. ఇతని భార్య ఆరేళ్ల క్రితమే మృతి చెందారు. సుబ్బారావుకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: తెనాలి మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయల కనిష్ట ధర రూ.1,400, గరిష్ట ధర రూ.2,000, మోడల్ ధర రూ.1,700 వరకు పలికింది.

కాసులు కురిపిస్తున్న కార్గో

2022-23లో రూ 2.31 కోట్లకు పెరిగిన ఆర్టీసీ ఆదాయం

- 2021-22లో రూ.1.47 కోట్ల రాబడి
- చీరాల డిపో నుంచే అత్యధికం
- డోర్ డెలివరీ దిశగా అడుగులు
- 4 డిపోల పరిధిలో అందుబాటులో సేవలు
- రోజుకు రూ.లక్ష రాబడి

'బస్సు చక్రం / ప్రగతికి చిహ్నం' ఇది ఏపీఎస్ఆర్టీసీ నినాదం. అందర్నీ అక్కున చేర్చుకుని వారివారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేరవేసే ఆర్టీసీ రథచక్రాలు ఇవాళ మరింత పరుగులు పెడుతున్నాయి. ఇప్పటి వరకు ప్రయాణికులను మాత్రమే చేరవేస్తున్న ఈ సంస్థ మరో అడుగు ముందుకు వేసి సరుకు రవాణా కోసం ఏర్పాటు చేసిన కార్గో పేరిట సేవలు అందిస్తున్న సంగతి తెలిసిందే. జిల్లాలో నాలుగు డిపోల పరిధిలోని 21 బస్ స్టేషన్లలో ఏర్పాటు చేసిన ఈ కార్గో సేవలు అందరికీ ఉపయుక్తంగా ఉండటమే కాదు.. ఆర్టీసీ ఆదాయానికి ఇతోధికంగా సాయపడుతున్నాయి.



కార్గోసేవలను బుక్ చేయించుకుంటున్న వినియోగదారులు



కార్గో ద్వారా వచ్చిన పార్శిల్‌ను వినియోగదారులకు అందజేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

బాపట్లటౌన్: ఆర్టీసీ సంస్థ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తూనే మరోవైపు సరుకు రవాణా (కార్గో) సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చింది. కార్గో సేవలను ఉపయోగించి ఆదాయం పెంచే దిశగా ఆర్టీసీ సంస్థ అడుగులు వేస్తోంది. ప్రైవేటు కొరియర్స్ ద్వారా వ్యయం పెరగడంతోపాటు సమయం ఆలస్యం కావడంతో వినియోగదారులు వస్తువులను పార్శిల్ చేసేందుకు ఆర్టీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్గో సేవల వైపు మొగ్గు చూపుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకున్న ఆర్టీసీ అధికారులు జిల్లాలో నాలుగు డిపోల పరిధిలో ఉన్న 21 బస్ స్టేషన్లలో కార్గో సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో నెలకు సుమారు రూ. లక్షపైగా ఆర్టీసీ సంస్థకు కార్గో సేవలపై ఆదాయం వస్తోంది.

అగ్రస్థానం చీరాలదే!

కార్గో సేవలపై ఆర్టీసీ సంస్థకు వచ్చే ఆదాయంలో చీరాల డిపో టాప్‌లో ఉండగా బాపట్ల డిపో లీస్ట్‌లో ఉంది. నెలకు చీరాల డిపో నుంచి రూ. 19.95 లక్షలు, అద్దంకి నుంచి రూ. 5.26 లక్షలు, రేపల్లె నుంచి రూ. 2.57 లక్షలు, బాపట్ల నుంచి రూ. 2.16 లక్షలు వస్తోంది. జిల్లాలో కార్గోపార్శిల్ రోజుకు సుమారు 600 పైగా బుక్ అవుతున్నాయి. నాలుగు డిపోల పరిధిలో కార్గో ఆదాయం రోజుకు రూ. లక్ష చొప్పున నెలకు రూ. 30 లక్షల మేర ఆదాయం లభిస్తోంది.

కార్గో సేవలు బాగున్నాయి



నేను చీరాలలో చీరాల వ్యాపారం చేస్తుంటా. నా షాపు నుంచి ప్రతిరోజు కాకినాడ, విశాఖపట్టణం, విజయవాడ, శ్రీకాకుళం, నెల్లూరు, హైదరాబాద్, మదనపల్లి తదితర ప్రాంతాలకు పార్శిల్ పంపుతుంటా. ఆర్టీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్గో సేవల వలన మేం పంపించిన చీరలు 24 గంటల్లోనే వినియోగదారుడికి చేరుతున్నాయి. ఎక్కడా కూడా ఆలస్యం జరగటం లేదు. పంపే వస్తువుకు భద్రతా ఉంటుంది. ఆర్టీసీ కార్గో సేవలు బాగున్నాయి.

–సి.హెచ్. శ్రీకాంత్, అంబికా సిల్క్స్, చీరాల

జిల్లాను ప్రథమస్థానంలో నిలుపుతాం



ఆర్టీసీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్గో సేవలను ప్రజలకు మరింత చేరువ చేసి కార్గో ఆదాయాన్ని పెంచే దిశగా అడుగులు వేస్తున్నాం. గడిచిన ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఇప్పటికే సుమారు రూ. 84 లక్షల మేర ఆదాయం పెరిగింది. త్వరలో డోర్‌డెలివరీ చేసేవిధంగా అడుగులు వేస్తున్నాం. ముందుగా చీరాల డిపో నుంచి డోర్‌డెలివరీ వ్యవస్థను ప్రారంభిస్తాం.

– విజయ్ కుమార్‌రెడ్డి, రీజినల్ మేనేజర్

ఆర్టీసీ సమాచారం:

జిల్లాలో ఆర్టీసీ డిపోలు	4
మొత్తం సర్వీసులు	247
ఉద్యోగులు	1198
రోజువారీ ఆదాయం	రూ.35 లక్షలు
2021-22 'కార్గో' ఆదాయం	రూ.1.46 కోట్లు
2022-23 ఇప్పటి వరకు వచ్చిన ఆదాయం	రూ.2.30 కోట్లు
రోజుకు నడిపే ట్రిప్పులు	1235
రోజుకు ప్రయాణించే ప్రయాణికులు	90,000
రోజువారీ తిరిగే కిలోమీటర్లు	1,00,000
నెలకు ఆర్టీసీ సంస్థ ఆదాయం	రూ.11 కోట్లు
కార్గో సర్వీసులపై జిల్లా టార్గెట్	రూ. 41 లక్షలు
ఇప్పటి వరకు వసూలు చేసింది	రూ.28 లక్షలు

ఈ ఏడాది రూ. 84 లక్షలు అత్యధికం!

నెల	2021-22	2022-23	వ్యత్యాసం
ఏప్రిల్	17,02,866	23,36,798	6,33,932
మే	5,70,102	23,04,845	17,34,723
జూన్	6,47,244	22,67,983	16,20,739
జులై	14,95,655	24,28,935	9,33,280
ఆగస్టు	17,89,202	28,58,567	10,69,365
సెప్టెంబర్	17,59,829	23,27,421	5,67,592
అక్టోబర్	20,56,214	23,56,042	2,99,828
నవంబర్	18,74,791	31,54,787	12,79,996
డిసెంబర్	27,41,557	29,93,465	2,51,908
మొత్తం	1,46,37,460	2,30,28,843	83,91,363

■ పెదకాకాని: స్థానిక శంకర కంటి ఆస్పత్రిలోని వార్డును ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈఓ హరేందర్ ప్రసాద్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. నెట్‌వర్క్ ఆరోగ్యమిత్రతో మాట్లాడారు. పేషెంట్ అడ్మిషన్, డిశ్చార్జి వివరాల నమోదులో తలెత్తే సాంకేతిక సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు.

జీఓ అందరికీ సమానమే

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున



భట్టిప్రోలు మండలం పడమటిపాలెంలో విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి నాగార్జున

పడమటిపాలెం(భట్టిప్రోలు): రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా, సంతోషంగా ఉండాలని జీఓ నంబర్- 1 తీసుకు రావడం జరిగిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున అన్నారు. భట్టిప్రోలు మండలం కోనేటిపురం పంచాయతీ పరిధిలోని పడమటిపాలెంలో శుక్రవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. మంత్రి నాగార్జున విలేకరులతో మాట్లాడుతూ జీఓ నంబర్-1 మాకైనా, చంద్రబాబుకైనా సమానమేనని పేర్కొన్నారు. చంద్రబాబు సభలకు జనం రావడం లేదని, అందుకోసం ఇరుకు సందుల్లో సభలు ఏర్పాటు చేసి ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. డ్రోన్ కెమెరాలు పెట్టి ఉన్న దాన్ని కొండంతలు చేసి చూపిస్తున్నారని పేర్కొన్నారు. దీని వల్ల అమాయక ప్రజలు బలైపోతున్నారని తెలిపారు. కుప్పం ప్రజలను ఇప్పటివరకు చంద్రబాబు మోసం చేస్తూ వస్తున్నారని అన్నారు. అక్కడ మా పార్టీ బీసీ నాయకుడు ప్రజలకు అందుబాటులో ఉన్నాడని తెలిపారు. రానున్న రోజుల్లో అక్కడ మా పార్టీ జెండా ఎగరడం ఖాయమని చెప్పారు. బీసీ నాయకుల ఎదుగుదలను చూసి ఓర్వలేకపోతున్నారని, ఆయనకు పాపభీతి లేదని తెలిపారు. సమావేశంలో సర్పంచ్ మోర్ల వెంకటేశ్వరమ్మ, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, వైస్ ఎంపీపీలు మల్లోలు ఉషారాణి, కొతరపు పిచ్చయ్యశాస్త్రి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాస్(నానీ) తదితరులు పాల్గొన్నారు.

దేశం గర్వించే స్థాయికి ఎదగాలి

బాక్సర్ అశోక్‌ను అభినందించిన జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్



అశోక్‌ను అభినందించిన జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: కష్టపడి దేశం గర్వించే స్థాయికి ఎదగాలని బాక్సర్ కొల్లాటి అశోక్‌కు జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. బాక్సింగ్ ఇంటర్నేషనల్ చాంపియన్‌షిప్ గేమ్‌లో రజిత పతకం సాధించిన అశోక్‌ను శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అభినందించారు. తొలుత అశోక్‌కు మెడల్‌ను అందజేశారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ నిజాంపట్నం మండలానికి చెందిన అశోక్ 2022 డిసెంబర్‌లో యూనిటెడ్ మ్యూత్తాయ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అగర్తలలో నిర్వహించిన బాక్సింగ్ ఇంటర్నేషనల్ చాంపియన్‌షిప్ గేమ్‌లో రజిత పతకం సాధించడం అభినందనీయమన్నారు. ప్రతిభ ఉన్నప్పటికీ ఆర్థిక సహకారం లేక వెనుకబడుతున్న తరుణంలో ఈ విషయం తెలుసుకున్న గుండ్రెడ్డి శివ రూ.2.50 లక్షలు ఆర్థిక సహాయం చేసి ప్రోత్సహించడం హర్షనీయమన్నారు. శివను ప్రత్యేకంగా అభినందించారు. ఎంతో మంది ప్రతిభావంతులు వివిధ కారణాలచేత వారి ప్రతిభ గ్రామస్థాయిలోనే ఆగిపోతున్నారని అటువంటి వారిని ప్రోత్సహిస్తే వారు దేశానికి మంచి పేరు తెస్తారని అన్నారు.

హెడ్‌కానిస్టేబుల్ భార్యకు చెక్కు అందజేత

పోలీస్ కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటామని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన హెడ్ కానిస్టేబుల్ షేక్ అహ్మద్‌బాషా భార్య షేక్ షరీఫ్ ఉన్నిషకు రూ.20.65 లక్షల చెక్కు శుక్రవారం అందజేశారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ షేక్ అహ్మద్ బాషా అంకితభావంతో పనిచేశారన్నారు. డీపీఓ ఏఓ వై.శివప్రసాద్‌రావు, బి.సెక్షన్ సూపరింటెండెంట్ కె.రాధిక పాల్గొన్నారు.

నమ్మి ఇంటిని అప్పగిస్తే ఇల్లే కాజేశారు

చీరాల: అనారోగ్యంతో ఉన్న వృద్ధురాలికి సపర్యలు చేసేందుకు వచ్చిన పనిమనిషి వృద్ధురాలి నిస్సహాయతను ఆసరాగా చేసుకుని ఆమె ఇంటినే తన పేరుపై రాయించుకున్నారు. ఈఘటన పట్టణంలోని పాపరాజుతోటలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చీరాలకు చెందిన ఎం.కుమార్ బెంగళూరులో ఉద్యోగం చేస్తున్నాడు. పాపరాజుతోటలోని సొంత ఇంటిలో నివసించే మేనత్త అవివాహితురాలు. అనారోగ్యంతో ఉండడంతో ఆమెకు సపర్యలు చేసేందుకు చీరాలకు చెందిన డి.లక్ష్మీరాజ్యం అనే మహిళను నెల జీతం ఇచ్చి పెట్టుకున్నారు. గత నెల 26న కుమార్ మేనేత్త మృతి చెందినట్లు లక్ష్మీరాజ్యం ఫోన్ ద్వారా తెలియచేయగా అంత్యక్రియలు చేశాడు. రెండు రోజులు క్రితం కుమార్ వద్ద లక్ష్మీరాజ్యం వచ్చి ఈ ఇంటిని తాను రూ.30 లక్షలు కొనుగోలు చేశానని, ఇళ్లు ఖాళీ చేసి తనకు అప్పగించాలని కోరింది. నిర్ఘాంతపోయిన కుమార్ విచారించగా తప్పుడు పత్రాలు, ఫోర్జరీ సంతకాలతో ఆ ఇంటిని లక్ష్మీరాజ్యం రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తెలుసుకున్నారు. అలానే గత ఏడాది అక్టోబర్ 10వ తేదీన ఆమె పేరిట రూ.10 లక్షలు డిపాజిట్ చేయించుకుందని తేలింది. దీంతో పలు సాక్ష్యాలతో కుమార్ ఒన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ మల్లికార్జునరావు కేసు నమోదు చేశారు.

అండర్-17 వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారుల ఎంపిక



పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

చీరాల టౌన్: ఈనెల 25 నుంచి కర్నూలులో జరగనున్న అండర్ -17 వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు బాపట్ల జిల్లా నుంచి నలుగురు క్రీడాకారులను ఎంపిక చేశామని జిల్లా డీఎస్‌డీవో పాల్ కుమార్, విశ్రాంత డీఎస్‌డీవో జీ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. శుక్రవారం పేరాలలోని సర్వమిత్ర వ్యాయామశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో క్రీడాకారుల వివరాలు వెల్లడించారు. 73 కిలోల విభాగంలో దేవరకొండ ప్రేమ్‌సాగర్, 81 కిలోల విభాగంలో ఎం.సంతోష్, 89 కిలోల విభాగంలో టి.పవన్‌ప్రసన్న, 96 కిలోల విభాగంలో టి.రవితేజలను ఎంపిక చేశామన్నారు. ఈ సందర్భంగా విశ్రాంత డీఎస్‌డీవో మాట్లాడుతూ జిల్లా తరఫున వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంటున్న నలుగురు క్రీడాకారులు ఉత్తమ ప్రతిభచూపి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు క్రీడాకారులు, కోచ్‌లు ఉన్నారు.

గ్రామీణ క్రీడ కబడ్డీ ఎంతో గొప్పది

పోటీలను ప్రారంభించిన మంత్రి మేరుగ నాగార్జున



మేదరమెట్ల: గ్రామీణ క్రీడ కబడ్డీ ఎంతో గొప్పదని, కబడ్డీని ప్రోత్సహించేందుకు టోర్నమెంట్ నిర్వహిస్తున్న నిర్వాహకులు అభినందనీయులని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. శుక్రవారం కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల గ్రామ పరిధిలో భ్రమర టౌన్‌షిప్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ పురస్కరించుకొని ఆంధ్ర, తెలంగాణ కబడ్డీ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. మంత్రి నాగార్జున ప్రారంభించి మాట్లాడుతూ భ్రమర టౌన్‌షిప్ దినదినాభివృద్ధి చెందాలని మంత్రి ఆకాంక్షించారు. కార్యక్రమంలో భాగంగా జ్యోతి ప్రజ్వల చేసి పోటీలు ప్రారంభించారు.

అలాగే క్రీడాకారులను పరిచయం చేసుకొని అభినందించారు. మొదటి మ్యాచ్ ప్రకాశం బుల్స్, వైజాగ్ వారియర్స్ మధ్య జరిగింది. ప్రకాశం బుల్స్ తొలిమ్యాచ్‌ను 36-22 స్కోర్ తేడాతో వైజాగ్‌పై గెలుపొందింది. కార్యక్రమంలో శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య, మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచు గరటయ్య, ఆర్డీవో సరోజినీ దేవి, మేనేజింగ్ డైరక్టర్ గల్లా రామచంద్రరావు, విజయవాడ ఇన్‌కంటాక్స్ ఆఫీసర్ అనిల్‌కుమార్, ఇందీవర్‌బాబు, శైలేష్ బాబు, రాష్ట్ర కబడ్డీ మెంబర్ చంద్రశేఖరరెడ్డి, కబడ్డీ జిల్లా అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు, వై.పూర్ణచంద్రరావు, కిశోర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆమంచి నియామకంపై బత్తుల హర్షం



కారంచేడు: పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జిగా ఆమంచి కృష్ణమోహన్ నియామకంపై వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర మార్కెటింగ్, కోఆపరేటివ్ రంగ ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం ఆయన మండలంలోని యర్రంవారిపాలెం గ్రామంలోని స్వగృహంలో విలేకర్లతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్‌ను నియమిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ప్రతి ఒక్కరూ శిరోధార్యంగా భావించాల్సి ఉందన్నారు. గ్రామస్థాయి నుంచి మండల, నియోజకవర్గ స్థాయి నాయకుల వరకు కూడా సీఎం నిర్ణయాన్ని స్వాగతించాల్సి ఉందన్నారు. రాజకీయంగా అనుభవజ్ఞుడైన ఆమంచిని సమన్వయకర్తగా నియమించడం వలన నియోజకవర్గంలో సమీకరణలు మారి, కార్యకర్తలు ఏక తాటిపై పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆమంచి పార్టీని విజయపథంలో నడిపిస్తారనే ఆశాభావం వ్యక్త పరిచారు. పి.శివారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు వై.లక్ష్మారెడ్డి, బాపిరెడ్డి, రాజగోపాల్ రెడ్డి, పమ్మి వెంకటరెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, సుబ్బారెడ్డి, నాగిరెడ్డి పాల్గొన్నారు.